## క్లుప్తంగా

### ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సీతారామారావు

**కోటనందూరు:** జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పెద్దాపురం ఆర్డీఓ సీతారామారావు ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శివకుమార్, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, వీఆర్వోలతో సమావేశమయ్యారు. ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరై కట్టుకునేందుకు ఆసక్తి చూపే లబ్ధిదారులందరికీ జియోట్యాగ్ చేయించాలన్నారు. కాలనీల్లో కనీస వసతుల కల్పనకు కృషి చేయాలన్నారు. అనంతరం కౌలుకార్డుల జారీ, సిటిజన్ ఔట్‌రిచ్ ధ్రువీకరణపత్రాలు, రీ సర్వే తదితర అంశాలపై వీఆర్వోలను సమీక్షించారు. ఆర్‌ఐ కుమార్, రెవున్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### రీ సర్వేతో రైతులకు మేలు


తూర్పులక్ష్మీపురంలో సర్వే చేస్తున్న సిబ్బంది

**ఏలేశ్వరం:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి శివ ప్రసాద్ అన్నారు. తూర్పులక్ష్మీపురం గ్రామంలో శనివారం జగనన్న భూరక్ష- భూహక్కు పథకంలో భాగంగా సమగ్ర భూ రీసర్వే నిర్వహించారు. రీసర్వేను ప్రారంభించిన ఎంపీటీసీ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మేలు చేసేందుకు రీసర్వే చేపట్టారన్నారు. భూమి రీసర్వే ద్వారా పూర్తిస్థాయిలో హక్కు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్వే సిబ్బంది ఎస్వీగిరి, ధరణి, సూర్యప్రకాశ్, సాయిదుర్గ, రాజశేఖర్, మణి పాల్గొన్నారు.

**రీ–సర్వేకు రైతులు సహకరించాలి**

**గోకవరం:** జగనన్న భూరక్ష- భూహక్కు పథకంలో భాగంగా భూ రీసర్వే ప్రారంభమవుతుందని తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 29వ తేదీ నుంచి కామరాజుపేట పంచాయతీ పరిధి శివరామపట్నం రామాలయం ఆవరణలో మధ్యాహ్నం 3 గంటలకు భూహక్కుదారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. రైతులు తమ భూమి పాసుపుస్తకాలు, ఆధార్ కార్డు, దస్తావేజులు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, బ్యాంక్ ఖాతా బుక్ వాటికి సంబంధించి రెండు సెట్స్ జిరాక్స్‌లు తీసుకురావాలని ఆయన తెలిపారు.

### కౌలుదారులకు భరోసా


రాపాకలో కౌలుదారుల సదస్సులో మాట్లాడుతున్న ఏఓ అశోక్ కుమార్

**తుని రూరల్:** సొంత భూమి లేని కౌలుదారులకు ప్రభుత్వం రైతు భరోసా నిధులు అందిస్తోందని మండల వ్యవసాయ అధికారి బి.అశోక్‌కుమార్ అన్నారు. శనివారం హెచ్.కొత్తూరు, రాపాకలో కౌలుదారుల అవగాహన సదస్సులు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న ఏఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ సాగుహక్కు పత్రాలతో కౌలుదారులు ఎన్నో రకాల ప్రయోజనాలు పొందవచ్చన్నారు. రాయితీ విత్తనాలు, పంట రుణాల నుంచి పంట విక్రయం వరకూ లబ్ధి చేకూరుతుందన్నారు. సొంతభూమి లేకుండా కౌలుకు సాగు చేసే రైతులకు ప్రభుత్వం రైతు భరోసా పథకం వర్తింపజేస్తోందన్నారు. ఈ అవకాశాలను కౌలుదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్.కొత్తూరు సర్పంచ్ సుబ్బారావు, ఏఈఓ పి.జగ్గప్పారావు, ఎంపీటీసీ సభ్యులు, వీఏఏలు, కౌలుదారులు పాల్గొన్నారు.

### డ్రైన్లలో పూడికతీత పనులు

**శంఖవరం:** జి.కొత్తపల్లిలో శనివారం పంచాయతీ సిబ్బంది డ్రైన్లలో పూడిక తీత పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించారు. ఈ పూడిక తీత పనులు సర్పంచ్ ఈగల విజయదుర్గ పరిశీలించారు. రోడ్లపై చెత్త చెదారం వేయకుండా చూడాలని సిబ్బందికి ఆదేశించారు.

### ఉత్సాహంగా వేళంగి క్రికెట్ టోర్నీ

**కరప:** మండలం వేళంగిలోని మెర్లాస్ జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో వేళంగి గ్రాడ్యుయేట్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్రికెట్ టోర్నీలో శనివారం ఐదు మాచ్‌లు జరిగాయి. నో ఏజ్ లిమిట్ విభాగంలో నాలుగు మ్యాచ్‌లు మొదటిమ్యాచ్‌లో చిన కొత్తూరు జట్టుపై పాతర్లగడ్డ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా సుధీర్ (పాతర్లగడ్డ) నిలిచాడు. రెండో మ్యాచ్‌లో పందలపాకజట్టుపై పేపకాయలపాలెం జట్టు గెలవగా వరప్రసాద్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు. మూడో మ్యాచ్‌లో మాలపాడు జట్టుపై చొల్లంగిపేట జట్టు గెలిచింది. సుభాష్(మాలపాడు) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా సాధించాడు. నాలుగోమ్యాచ్‌లో విజయరాయుడుపాలెం జట్టుపై పెనుగుదురు జట్టు గెలిచింది. రోహిత్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ సాధించాడు. అండర్–19 విభాగంలో జగన్నాధగిరి జట్టుపై భావారం గెలవగా, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా బన్నీ నిలిచాడు.

# పీహెచ్‌సీ ఏర్పాటుకు రంగం సిద్ధం

- త్వరలో అందుబాటులోకి వైద్యసేవలు
- నెరవేరనున్న రౌతులపూడి మండల ప్రజల కల
- ఫలించిన ఎమ్మెల్యే 'పర్వత' కృషి



ములగపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు సుందరంగా తీర్చిదిద్దిన భవనం

**రౌతులపూడి:** ఆరోగ్య సమస్య వచ్చిందా వైద్యం కోసం పక్క మండలానికి పరిగెత్తాల్సిందే.. 44 గ్రామాలు ఉన్న రౌతులపూడి మండలంలో దశాబ్దాల కాలంగా పీహెచ్‌సీ(ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) లేకపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో సార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. గత పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు. ఎట్టకేలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పీహెచ్‌సీ ఏర్పాటు రంగం సిద్ధం చేసింది.

**పాత కోఆపరేటివ్ భవనంలో..**

మండలం ఏర్పడి 20 ఏళ్లు అవుతున్నా పీహెచ్‌సీ లేక అవస్థలు పడుతున్నామని స్థానిక నేతలు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల వైద్య, ఆరోగ్య సమస్యలను గుర్తించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఆరోగ్య శాఖ మంత్రి, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు స్పందించి ఎట్టకేలకు ములగపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు మార్గం సుగమం చేశారు. ఈ మేరకు ఇటీవల ములగపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు రూ.2.50కోట్లు నిధులను మంజూరు చేయించి అందుకు అవసరమైన పరిపాలన ఉత్తర్వులు వచ్చేలా చర్యలు చేపట్టారు. పాత కో-ఆపరేటివ్ భవనాన్ని తాత్కాలిక మరమ్మతులు చేసి అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. త్వరలో ఆ భవనంలో పీహెచ్‌సీని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మూరుమూల గ్రామాలకు పీహెచ్‌సీ

**స్థానికంగా పీహెచ్‌సీ లేక..**

ప్రజలకు ఆరోగ్య సమస్యలు వచ్చినా, గర్భిణులు ప్రతి వారం బీపీ, షుగర్, రక్త నమూనాలు, సాధారణ పరీక్షలు నిర్వహించుకోవడానికి నానా పాట్లు పడేవారు. మండలంలో 26 పంచాయతీల పరిధిలో మొత్తం 12 సబ్ సెంటర్లు ఉన్నాయి. ఈ సబ్‌సెంటర్లలో ఒక ఏఎన్‌ఎం, ఒక హెల్త్ అసిస్టెంటు ఉండి స్థానికంగా ఆయా గ్రామాల్లోని రోగులకు సేవలందించేవారు. అయితే ఈ రోగులను ఆరోగ్య సిబ్బంది స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేకపోవడంతో పక్క మండలాలైన శంఖవరం మండలంలోని పెదమల్లాపురం, కోటనందూరు, తుని మండలంలోని తేటగుంట పీహెచ్‌సీలకు పంపించేవారు. రోగులు అక్కడకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకునేవారు. వారు ఆర్థికంగాను, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు పడేవారు. అంతేకాకుండా ఆయా పీహెచ్‌సీలకు వెళ్లాలంటే సుమారు 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది.

**రుణపడి ఉంటాం**



గడచిన 20 ఏళ్లుగా మండలంలో పీహెచ్‌సీ లేకపోవడంతో మా ప్రాంతంలోని ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతం ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లాం. వెంటనే స్పందించిన ఆయన పీహెచ్‌సీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు కృతజ్ఞతలు, అందరం రుణపడి ఉంటాం.

– సీహెచ్‌వీవీ సత్యనారాయణ, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు ములగపూడి

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం**



ములగపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. భవన సముదాయానికి ఆసుపత్రి నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ఇద్దరు వైద్యులతో పాటు ఇతర సిబ్బందిని నియమించారు. అధికారికంగా సేవలందించేందుకు ములగపూడిలో పాత కో ఆపరేటివ్ భవనాన్ని ఎంపిక చేసితాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. త్వరలో సేవలు ప్రారంభిస్తారు. రౌతులపూడి మండలంలోని రాజవరం, గంగవరం, ములగపూడి, రాఘవపట్నం, ఎస్.పైడిపాల, ఎ.మల్లవరం, లచ్చిరెడ్డిపాలెం, రౌతులపూడి-1, రౌతులపూడి-2 సబ్ సెంటర్ల(ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు)పరిధిలోని ప్రజలంతా ఈ పీహెచ్‌సీలో సేవలు పొందువచ్చు. ఆ దిశగా త్వరలో చర్యలు చేపడుతున్నాం.

– డా.సత్యనారాయణ, శంఖవరం పీహెచ్‌సీ

### వాలీబాల్ పోటీలకు భీమవరపుకోట విద్యార్థి


వరుణ్‌సందేశ్

**కోటనందూరు:** జాతీయస్థాయిలో జరిగే వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు భీమవరపుకోట విద్యార్థి ఎంపికయ్యాడు. ఆదివారం నుంచి జూన్ రెండో తేదీ వరకూ కోల్‌కతలో జరిగే 45వ సబ్‌జూనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్(అండర్-17) టోర్నమెంట్‌లో భీమవరపుకోటకు చెందిన వరుణ్ సందేశ్ పాల్గొనున్నాడు. ఈ నెల 25న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కుంచే యశ్వంత్(జెస్సీ) ఆధ్వర్యంలో జాతీయస్థాయి జట్టుకు రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారుల ఎంపిక నిర్వహించింది. ఈ ఎంపికలో ఆరుగురు సభ్యుల జట్టుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి వరుణ్ సందేశ్ ఎంపికయ్యాడు. వరుణ్‌సందేశ్ ప్రస్తుతం రౌతులపూడి మండలం ఏ మల్లవరంలో ఏపీ రెసిడెన్సియల్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. భీమవరపుకోట గ్రామానికి చెందిన రిచర్డ్‌శామ్యూల్ వరుణ్‌సందేశ్‌లో దాగిఉన్న ప్రతిభను గుర్తించి జాతీయస్థాయి ఎంపికకు అన్ని విధాల ప్రోత్సహించాడు. వరుణ్ సందేశ్‌ను సర్పంచ్ జిగటాల వీరబాబు, గ్రామపెద్దలు అభినందించారు.

### ఇంటర్ పరీక్షలకు 21 మంది గైర్హాజరు

**కిర్లంపూడి:** స్థానిక జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలకు 21 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరం 402 మంది విద్యార్థులకు గాను 388, రెండో సంవత్సరం 134 మంది విద్యార్థులకు గాను 127మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

## సత్యదేవునికి జన్మనక్షత్ర పూజలు


ఆయుష్య హోమం నిర్వహిస్తున్న పండితులు

**అన్నవరం:** రత్నగిరి వాసుడు సత్యదేవుని జన్మ నక్షత్రం 'మఖ' సందర్భంగా శనివారం స్వామివారి మూలవిరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, యాగశాలలో ఆయుష్య హోమం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయాన్ని తెల్లవారుజామున రెండు గంటలకు తెరిచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితులు సత్యదేవుడు, అనంతలక్ష్మి సత్యవతీదేవి అమ్మవార్లు, శంకరుల మూలవిరాట్‌లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, పట్టువస్త్రాలతో అలంకరించారు. పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆరు గంటల తర్వాత భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. సత్యదేవునికి యాగశాలలో ఆయుష్య హోమం ఘనంగా చేశారు. అనంతరం హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి ఘనంగా పూర్ణాహుతి నిర్వహించారు. దేవస్థానం వేదపండితులు గొల్లపల్లి ఘనాపాఠీ, చిట్టి శివ, యనమండ్ర శర్మ, రమేష్, ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి, పురోహితులు కొంపెల్ల మూర్తి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

**స్వామివారి గర్భాలయ ప్రదక్షిణ ప్రారంభం**

సత్యదేవుని గర్భాలయ ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా శనివారం ప్రారంభించారు. ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకూ ఈ ప్రదక్షణకు అంతరాలయం టిక్కెట్ తీసుకున్న భక్తులను అనుమతించారు. ఆ తరువాత రద్దీ అధికంగా ఉండడంతో ప్రదక్షిణతో బాటు అంతరాలయ దర్శనాన్ని కూడా నిలిపివేశారు.

### కేంద్ర పథకాలపై ప్రచారం చేయాలి

**ఏలేశ్వరం:** కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై ప్రచారం చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టెం వెంకటరమణ అధ్యక్షతన శనివారం పార్టీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలు గ్రామస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీనాయకులు దాకేకృష్ణారావు, కర్రి ధర్మరాజు, రెడ్డి లోవరాజు, సత్యనారాయణ, సీతారామ్ పాల్గొన్నారు.

**గోకవరం:** బీజేపీ మండల సమావేశం శనివారం గోకవరంలో నిర్వహించారు. ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు బత్తుల వెంకన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట మంగరాజు, మాజీ ఎమ్మెల్యే కేవీవీ సత్యనారాయణ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు కామినేని జయశ్రీ, మండల ప్రధాన కార్యదర్శి మండిగా వెంకన్న దొర, సాంబశివ, అడపా దొరబాబు పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### మహిళల పారాయణ

**ఏలేశ్వరం:** విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం మహిళలు పారాయణాలు పఠించారు. పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్‌వీధిలోని హనుమాన్ ఆలయ ప్రాంగణంలో విష్ణుసహస్ర, భగవద్గీత, లక్ష్మీ అష్టోత్తర, లలితాసహస్ర పారాయణాలు చేశారు. అనంతరం భక్తి గీతాలు ఆలపించారు. కార్యదర్శి కటకం కిరిటీ, సంఘ మహిళా సభ్యులు మల్లేశ్వరీ, కల్యాణి, రమ్య, మంగామణి, కామాక్షి, రేవతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### రేపు 'వలంటీర్లకు వందనం'

**రౌతులపూడి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎ.గోవింద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై ఎంపికైన పురస్కారాలు అందజేస్తారన్నారు.

### 'పాలవెల్లువ'పై శిక్షణ



జగ్గంపేటలో శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ హరికృష్ణ

**జగ్గంపేట:** ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తోందని జగ్గంపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరికృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జగనన్న పాలవెల్లువ కార్యక్రమం విధివిధానాలు, లబ్ధిదారుల ఎంపిక, అమలు తీరుపై మండల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన మహిళా డెయిరీ అసోసియేషన్ కేంద్రంలో ప్రమోటర్లుగా నిర్ణయించిన 11 మంది సభ్యులు కచ్చితముగా పాలు పోస్తూ ఇతర మహిళలను ప్రోత్సహించాలన్నారు. రోజుకు కనీసం 160 లీటర్ల పాలను సేకరించేలా కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట తహసీల్దార్ శ్రీదేవి, అధికారులు, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల రథసారథులు వలంటీర్లు

**వలంటీర్ల సేవలకు అభినందనలు**


గ్రామ వలంటీర్లను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


టి.తిమ్మాపురంలో వలంటీర్లను సన్మానిస్తున్న గంగాభవానీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీలు


ఎస్.తిమ్మాపురంలో వలంటీర్లను సత్కరించిన వైఎస్సార్ సీపీ నాయకులు


తుని పట్టణంలో వలంటీర్లను సత్కరిస్తున్న వైస్ చైర్మన్ మహేష్, కౌన్సిలర్లు

**తుని రూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల రథసారథులు వలంటీర్లేనని రాష్ట్ర పెరిక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం గంగాభవాని అన్నారు. శనివారం తేటగుంట, టి.తిమ్మాపురం గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాలు జరిగాయి. టి.తిమ్మాపురంలో పాల్గొన్న ఆమె వలంటీర్లను ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పింఛన్ల పంపిణీ, అమ్మఒడి, విద్యా, వసతి దీవెనలు, జగనన్న చేయూత తదితర పథకాలు, జగనన్న కాలనీలో సొంతింటి కలలు నెరవేర్చడంలో వలంటీర్ల పాత్ర కీలకమన్నారు. తేటగుంటలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, మండల వ్యవసాయ మండలి చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు పాల్గొని వలంటీర్లను సత్కరించారు. సర్పంచ్‌లు అత్తి నాగరాజు, అత్తి వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ, నాయకులు చిటికెల వరహాలబాబు, ఈఓపీఆర్‌డీ జయరామ్, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**ప్రత్తిపాడు రూరల్:** ఒమ్మంగిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వలంటీర్లను వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జి రామిశెట్టి చినబాబు, స్థానిక పార్టీ నేత రామిశెట్టి బులిరామకృష్ణ వారిని ఘనంగా సన్మానించారు. గ్రామంలో రెండు గ్రామ సచివాలయాల పరిధిలో 49 మంది వలంటీర్లకు అర్హులైన 44 మందికి సేవ మిత్ర అవార్డు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సొసైటీ చైర్మన్ కొప్పన గంగారావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

**కిర్లంపూడి:** వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ నాయకుడు ఓలేటి రాజేశ్వరరావు అన్నారు. శనివారం ఎస్.తిమ్మాపురంలో సర్పంచ్ మందేటి వీరలక్ష్మి ఆధ్వర్యంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సచివాలయం పరిధిలోని 10 మంది వలంటీర్లను నగదుతో పాటు ప్రశంస పత్రాలు అందజేసి రాజేశ్వరరావు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు వనపర్తి వీరభద్రరావు, దేవాబత్తుల సువర్ణరాజు, మందేటి పెద్దిరాజు, గృహసారధులు పాల్గొన్నారు.

**తుని:** ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్ అన్నారు. శనివారం పాత బజారు వీధి 10వ సచివాలయంలో 19, 20, 21 వార్డులకు చెందిన వలంటీర్లను సేవా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లకు నూతన వస్త్రాలు, స్వీట్లు, శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వం వలంటీర్ల సేవలను గుర్తించి నగదు ప్రోత్సాహక అవార్డులను ప్రకటించి ప్రోత్సాహించిందన్నారు. వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ మార్నీడి శ్రీను, కౌన్సిలర్లు ఆచంట సురేష్, రాసబోయిన జీవరత్నం, అల్లాడ దివాణం, నాయకులు తృహాడి శంకర్రావు, కె.వెంకట్రావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### సారా బట్టీలపై పోలీసుల దాడి

**జగ్గంపేట:** గ్రామ శివారు మామిడితోటలో గుట్టు చప్పుడు కాకుండా తయారు చేస్తున్న సారా బట్టీపై జగ్గంపేట సీఐ సూర్య అప్పారావు ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ సూర్య అప్పారావు తెలిపారు. జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### అత్యవసర వైద్యంతో ప్రాణానికి రక్షణ

**బోట్‌క్లబ్:** గుండెపోటు, పక్షవాతం వంటి అత్యవసర పరిస్థితుల్లో రోగికి ప్రాథమిక చికిత్స సకాలంలో అందిస్తే బతికే అవకాశాలు చాలా ఎక్కువని ప్రముఖ కార్డియాలజిస్ట్ ఎంఆర్‌ఎస్ మహేష్ అన్నారు. శనివారం అపోలో ఆసుపత్రిలో వరల్డ్ ఎమెర్జెన్సీ మెడిసిన్ డే నిర్వహించారు. గుండె పోటు వచ్చినప్పుడు ఛాతి దగ్గర నొప్పితో, ఆయాసంతో బాధపడతారని అటువంటి లక్షణాలు కనపడిన వెంటనే మంచి సదుపాయాలు ఉన్న ఆసుపత్రికి తరలించాలన్నారు. సమయం వృధా అయ్యే కొద్ది గుండెపోటు ప్రాణాంతకం అవుతుందన్నారు. న్యూరో ఫిజిషియన్ శివరామగాంధీ, డాక్టర్ భువనాంజలి పలు జాగ్రత్తలు వివరించారు.

### ఉష్ణతాపానికి ప్రజలు విలవిల


తుని పట్టణంలో నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారులు

**తుని:** పెరుగుతున్న ఉష్ణతాపానికి ప్రజలు విలవిలాడుతున్నారు. ఉదయం 11 గంటలకు వడగాల్పులు వీస్తున్నాయి. శనివారం పట్టణంలోని వ్యాపారులు మధ్యాహ్నం దుకాణాలు మూసివేసి సాయంత్రం తీస్తున్నారు. ప్రధాన రహదారులు నిర్మానుష్యం మారాయి. ప్రజలు వేడి నుంచి ఉపశమనం పొందడానికి మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరకు రసం, ఫ్రూట్ జ్యూస్‌లను ఆశ్రయిస్తున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో బయటకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు.

### రత్నగిరి భక్తులకు ఎండ దెబ్బ


పశ్చిమ రాజగోపురం మెట్ల మీద కార్పెట్ లేని దృశ్యం

**అన్నవరం:** రత్నగిరి సత్యదేవుని సన్నిధికి శనివారం వేలాదిగా తరలివచ్చినిన భక్తులు ఎండకు విలవిల్లాడారు. దేవస్థానంలోని తూర్పు రాజగోపురం దిగువ నుంచి రోడ్డు వద్దకు ఉన్న మెట్లు మీద భక్తులు కాళ్లు కాలకుండా ఎటువంటి కార్పెట్ వేయకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. గ్రానైట్ మెట్లు కావడంతో ఎండకు బాగా వేడెక్కిపోవడంతో భక్తుల నడవలేక పరుగులు తీశారు. అయితే ఈ మెట్ల మీద గతంలో వేసిన తెల్ల పెయింట్ పోవడంతో భక్తులకు ఇబ్బందులు తప్పడంలేదు. పశ్చిమ రాజగోపురం వద్ద మజ్జిగ పంపిణీ చేసే చోట కూడా నీడ లేకపోవడంతో భక్తులు అవస్థలు పడ్డారు. నీడగా ఉన్న ప్రదేశంలో మజ్జిక పంపిణీ చేయాలని, క్యూలైన్లలో మంచినీరు అందించాలని భక్తులు కోరుతున్నారు.

## సభ్యులపై ఎంపీపీ నియంతృత్వం

- సభను బహిష్కరించిన జెడ్పీటీసీ
- మమ అనిపించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎం.గోవింద్


సమావేశంలో ఎంపీపీ, ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం

**రౌతులపూడి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.గోవింద్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్ష స్థానంలో ఉన్న ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి నియంతృత్వ ధోరణిలో వ్యవహరించారని అధికార పార్టీకి చెందిన పలువురు సభ్యులు ఆరోపించారు. ముందుగా ఎంఈఓ ఎస్వీ నాయుడుని పిలిచి విద్యాశాఖకు సంబంధించిన వివరాలు తెలిపాలని ఆదేశించడంతో ఆయన ఈ ఏడాది పదో తరగతి పరీక్షా ఫలితాలు, వచ్చే విద్యా సంవత్సరంలో అందించబోయే జగనన్న విద్యాకానుకు కిట్లు, నాడు–నేడులో పాఠశాలల అభివృద్ధి తదితర పలు అంశాలు గురించి వివరించారు. దీంతో పదో తరగతి పరీక్షా ఫలితాలు గురించి తనకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ఎంపీపీ రాజ్యలక్ష్మి ఎంఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎన్నడూ పదో తరగతి పరీక్షా ఫలితాలు గురించి ఎవరు అడగలేదని, ఇకపై సమాచారం తెలియజేస్తమని చెప్పడంతో తరువాత సభను కొనసాగించారు. అనంతరం వ్యవసాయ శాఖ, వైద్యారోగ్యా శాఖ నుంచి శంఖవరం పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాయికుమార్ మండలంలో అమలులో ఉన్న పథకాలు, ఇటీవల మంజూరైన పీహెచ్‌సీల గురించి వివరించారు. ఇంతలో మండల పరిషత్ సమావేశానికి గౌరవ జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం హాజరయ్యారు. ఆయనకు సమావేశంలో ప్రత్యేకంగా సీటు ఏర్పాటు చేయకపోవడం గుర్తించారు. సీటు కేటాయించనప్పుడు తనను ఎందుకు సమావేశానికి ఆహ్వానించారని ఎంపీడీఓ, ఎంపీపీలను ఆయన ప్రశ్నించారు. దీంతో ఎక్కడ సీటు ఖాళీగా ఉంటే అక్కడకు వెళ్లి కూర్చోవాలని ఎంపీపీ రాజ్యలక్ష్మి నియంతృత్వ ధోరణితో సమాధానం ఇచ్చారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన జెడ్పీటీసీ సభ్యుడు సమావేశాన్ని బహిష్కరించి బయటకు వెళ్లిపోయారు. దీనిపై ఇది సరైన పద్ధతి కాదని తోటి గౌరవ జెడ్పీటీసీ సభ్యుడికి ఇచ్చే గౌరవం ఇదేనా అని పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎంపీపీ తీరుపై మండిపడ్డారు. అనంతరం వ్యవసాయం, పశుసంవర్ధక శాఖ తదితర పలు శాఖల అధికారులు తమ తమ శాఖల పని తీరు గురించి వివరించి సమావేశానికి మమ అనిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## వేసవిలో పిల్లలపై శ్రద్ధ తీసుకోవాలి

**కొత్తపల్లి:** వేసవిలో చిన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మూలపేట సెక్టార్ సూపర్ వైజర్ అరుణ అన్నారు. పొన్నాడ శివారు శ్రీలంవారిపాలెంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఉదయం 8.30 గంటలకు తెరువాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో పిల్లలు బయట తిరుగకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకూ ఉండేలా చర్యలు చేపట్టాన్నారు. ఆట పాటలతో కూడిని విద్యను అందించాలన్ని సూచించారు. పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని తెలిపారు. మూడు ఏళ్ల దాటిన పిల్లలను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలల్లో చేర్చు కోవాలని ఆదేశించారు.